పట్టా భూములపై హక్కులేవీ...!

- నత్తనడకన నిషేధిత జాబితా నుంచి తొలగింపు ప్రక్రియ
- వివాదాస్పద ,కోర్టు కేసులున్న వాటి సమీప భూములు కూడా..
- సర్కారు ఆదేశాలిచ్చినా ..అవగాహన లేమితో పరిశీలనలో జాప్యం
- రైతులు, యాజమానులకు తప్పని ప్రదక్షిణలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: సాంకేతిక కారణాలతో పట్టా(సొంత) భూములపై హక్కులు కోల్పోయిన రైతులు , ప్లాట్ల యాజమానులు తమకు న్యాయం చేయాలని ప్రతి రోజు నగర శివారు కలెక్టర్ ,రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం దక్కడం లేదు. ధరణి పోర్టల్‌కు సంబంధించి పూర్తి అధికారాలను ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించటంతో పని భారం వల్ల ఈ దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించక పోవటంతో పెండింగ్‌లో పడుతున్నాయి. ఇటీవల ఓటర్ల జాబితా తదితర అంశాలలపై కలెక్టర్లతో సహా రెవెన్యూ యంత్రాంగం బీజీ కావడం కూడా జాప్యానికి కారణంగా తెలుస్తోంది. దీంతో దరఖాస్తు దారులు నానా ఆగచాట్లు పడుతున్నారు. ధరణి పోర్టల్‌తోపాటు ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు తప్ప కలెక్టర్లు మిగతా సమస్యలపై ఫోకస్ చేయలేకపోతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

◆ సర్కారు ఆదేశించినా ...

నిషేధిత జాబితాలో నమోదైన పట్టా భూములను స్వచ్ఛందంగా తొలగించాలని ప్రభుత్వం నిర్దేశించినప్పటికీ,ఈ ప్రక్రియ నత్తకు నడక నేర్పుతోంది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా.. సర్కారు ముందుకొచ్చినా క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల సహాయ నిరాకరణతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత ప్రభుత్వ భూములను ధరణి పోర్టల్‌లోని నిషేధిత జాబితా 2 (ఎ)లో నమోదు చేశారు. అదే సమయంలో సాంకేతిక కారణాలతోపాటు సిబ్బంది తప్పిదాల వల్ల కొన్ని పట్టా భూములు కూడా అందులో చేరాయి. దీనికి తోడు ప్రభుత్వ భూములకు సమీపంలోని స్థలాలు కూడా నమోదయ్యాయి. సమీపంలో వివాదాస్పద ,కోర్టు కేసులున్న భూములు, ప్లాట్లు కూడా నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో ఆడ పిల్లల పెళ్లిళ్ల ,ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తంతోపాటు పలు అవసరాల కోసం వాటిని విక్రయించేందుకు రైతులు ,ప్లాట్ల యాజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ కొరవడిన అవగాహన..

నిషేధిత జాబితా నుంచి పట్టాభూముల తొలగింపు ప్రక్రియలో తహసీల్దారుతోపాటు రెవెన్యూ ఉద్యోగులు కీలక భూమిక పోషించాల్సి ఉంది. ఈ ప్రక్రియపై అవగాహన కొరవడిన రెవెన్యూ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారుల నిఘా లేని పలు చోట్ల కొందరు రెవెన్యూ ఉద్యోగులు కూడా ప్రతి ఫైల్‌కు రేట్లు ఫిక్స్ చేసి...కొర్రీలు పెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇక్కడే అత్యధికం

నిషేధిత భూముల జాబితాను పరిశీలిస్తే...నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. శివారులోని ఈ రెండు జిల్లాల పరిధిలో అత్యధిక మండలాల్లో రైతులు పట్టా భూములు, కోర్టు కేసులకు సంబంధించిన భూములపై ఉన్న నిషేధం తొలగింపుపై గత కొన్నేళ్లుగా కలెక్టర్ ,రెవెన్యూ కార్యాయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వంశపారంప్యంగా వచ్చిన పట్టాభూములు కూడా నిషేధిత జాబితాలో చేరడంతో వాటిని విక్రయించుకోలేక పోతున్నారు. దీంతో నగర శివారు జిల్లాల్లోని పలు మండలాల్లో రెవెన్యూ సిబ్బంది తప్పిదాల వల్ల కూడా చాలా మంది రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సునిల్‌కుమార్, అరుణ్ కుమార్



కీసరలో..

కీసర: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కీసరకు చెందిన హంబడ్ మోహన్ లాల్‌చౌదరి అన్నారు. ఆదివారం కీసర చౌరస్తాలో ప్రతి ఆదివారం అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడూతూ మహనీయుడిని స్మరించుకునేందుకు అంబేడ్కర్ సంఘం నేతలు తనకు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకపు మాధురి, కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మొర్గు రవీందర్, ప్రధాన కార్యదర్శి దాయర శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదేరమేష్‌గుప్తా, కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యులు శీలం శ్రీనివాస్, గుర్రం లక్ష్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రవణ్ గుప్తా, తటాకం ఉమాపతి, నేతలు రామిడి విజయ్‌రెడ్డి, చినింగని బాల్‌రాజ్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, కర్రెగణేష్, రమేష్, సుమన్‌బన్ని, శీలం భూపాల్, మైసయ్య, గణేష్ రాంజీ రాంలాల్, పరహార్ మహేందర్ చౌదరి, మాంగిలాల్, పుక్ రాజ్, ధర్మారామ్, చందు, జుమన్ చౌదరి , దేవడ మోహన్‌లాల్‌జి, కృష్ణచౌదరి, వివిధ పార్టీల నేతలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచన విధానాలను అనుసరించాలి

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సునిల్‌కుమార్ హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత కుల, మత, ప్రాంత, లింగ వివక్ష లేకుండా అంబేడ్కర్ ఆలోచన విధానాలను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో దాసు, నర్సింగ్‌రావు, బాలయ్య, నారాయణ, అంజయ్య, నవీణ్‌కుమార్, మల్లేశ్, ఉపేందర్, రవితేజ, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గౌడవెల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ పవన్ చందు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి, సాకేత్ విల్లాస్, బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

మేడ్చల్ పరిధిలో..

చెట్ల కొమ్మలు నరికివేత కారణంగా మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీ, వినాయక్‌నగర్ 1,2, ఎస్‌బీహెచ్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి



తాగునీటి సమస్యను పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి సిలికాన్ వ్యాలీలో నీటి సమస్యను పరిష్కరిస్తామని మునిసిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్వయంగా సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి సరఫరా పైప్‌లైన్ అయ్యప్ప కాలనీ రోడ్ క్రాసింగ్ చేయాల్సి ఉందని, పనులను ఆదివారం రాత్రి వరకు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సతీష్, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ అవసరాలకు ప్రణాళిక వేసుకోవాలి



మహిళా ఉద్యోగులతో సదస్సు నిర్వాహకులు

ఘట్‌కేసర్: వృద్ధాప్య, భవిష్యత్ అవసరాల కోసం ప్రణాళిక అవసరమని యుంగాంతర్ ఎన్జీఓ సీఈఓ తేజస్విని అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో నాన్ మహిళ ఉద్యోగులకు స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, యుంగాంతర్ ఎన్జీఓ సంయుక్తంగా ×బడ్జెట్ రాణి¶ పేరుతో ్షమహిళలకు ఆర్థిక అక్షరాస్యత¶¶పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ ఆదాయం, వ్యయం, మూలాల జాబితా, జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలపై అవగాహన కల్పించారు. ఆర్థిక అత్యవసర పరిస్థితుల కోసం బడ్జెట్, పొదుపు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పీఎస్ఎన్ మూర్తి, విష్ణవందన, యూనివర్సిటీ నాన్ టీచింగ్ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి మృతి



నారాయణరెడ్డి (ఫైల్)

మేడ్చల్: బీజేపీ సీనియర్ నాయకుడు గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ గడీల నారాయణరెడ్డి అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మండలాల్లో బీజేపీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని బీజేపీ నాయకులు అన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



జవహర్‌నగర్: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అంబేడ్కర్‌నగర్ యాదవ సంఘం అధ్యక్షులు పంతంగి కుమార్‌యాదవ్ అన్నారు. అంబేడ్కర్‌నగర్ యాదవ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంతంగి కుమార్, ఉపాధ్యక్షులుగా బండి సతీష్, చిన్నబోయిన మహేందర్, మర్రి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చెన్నబోయిన రాములు, కోశాధికారిగా మెండే రాజశేఖర్, బొడ్డు నవీన్, సహాయ కార్యదర్శిగా కొమురయ్య, శ్రీను, కృష్ణ, ప్రచార కార్యదర్శిగా వెంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు చిన్నబోయిన సాయిలు, కాగిత రాజు, పంతంగి సిద్దులు, మల్లేష్, రాజయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని నాల్గో వార్డులో యువసేన ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాని విశేష స్పందన లభించింది. మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి రావాలని, అందుకు హెల్త్ క్యాంప్‌లు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీ వేణు, శ్రీనివాస్ గౌడ్, డాక్టర్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

కాచవానిసంగారంలో వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ కొంతం వెంకట్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 528 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలిమా మాడ్లాడుతూ వైద్యశిబిరానికి హాజరైన వారికి నీలిమా ఆస్పత్రిలో 50 శాతం రాయితీతో వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, శశాంక్, వైద్యసిబ్బంది భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ





కీసర: మణిపూర్‌లో జరిగిన హింసాకాండకు నిరసనగా ఆదివారం సాయంత్రం కీసర మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. నాగారం, దమ్మాయిగూడ, మున్సిపాలిటీల చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీతా శ్రీకాంత్‌గౌడ్ ఈ ర్యాలీని ప్రారంభించారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ నుంచి నాగారం మున్సిపాలిటీ వరకు కొనసాగిన ఈ ప్రదర్శనలో సుమారు 1000 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన హింసకాండ పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కీసర మండల పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు గాబ్రియల్, పాల్‌డేవిడ్, లాజరస్‌లాల్‌సింగ్,జాన్, హర్షవర్ధన్, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్లు పంగ హరిబాబు వెంకటేష్, కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా జెండా కార్యక్రమం





మేడ్చల్: అజాదీకా అమృత్ మహోత్సవాలలో భాగంగా బీజేపీ నాయకులు మేడ్చల్ పట్టణంలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారిపై ఐటీఐ కళాశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం త్యాగాలు చేసిన వీరులను గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర సమరయోధుల చరిత్రను రాబోయే తరాలకు తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వినర్ అమరం మోహన్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రేందాస్,హేమలత కౌన్సిలర్ హంసకృష్ణగౌడ్ ,శ్రీనివాస్‌గౌడ్, వంశీవిజయ్, అర్జున్, రాఘవరెడ్డి, అరుణ, హరిబాబురెడ్డి, శ్రీనాధ్‌రెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కీసర మండలంలో..

కీసర: కీసర మండలం భోగారం, కీసర గ్రామాల్లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భోగారం ఎంపీటీసీసభ్యుడు సింగిరెడ్డివెంకట్‌రెడ్డి, నేతలు రమేష్‌రెడ్డి, నల్లవెంకట్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, కృష్ణ, వేణుగోపాల్, శ్రీనివాస్, కాటం మల్లేష్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్యయాదవ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్ రెండో వార్డులో గోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీజ్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ రమాదేవి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గిరిజన యువతులు తొమ్మిది రోజులుగా నవధాన్యాలకు నీరు పోసి పెంచిన వెదురు బుట్టల్లోని నారును ఎత్తుకుని నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్యనాయక్, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, ఎఫ్ఎసీఎస్ మాజీ డైరెక్టర్, నరేశ్‌గౌడ్, నర్సింగ్‌రావు, గోర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములునాయక్, మోతీలాల్, రమేశ్, పురుషోత్తం, డీజీ నాయక్, సంతోశ్, శంకర్, సిరాజ్ పాల్గొన్నారు.



సీఎం కృషితోనే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్



మేడ్చల్: కంటోన్మెంట్ ప్రాంతంలో అత్యాధునిక ఫ్లై ఓవర్‌ల నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒత్తిడితోనే కేంద్రం అనుమతులు మంజూరు చేసిందని బీఆర్ఎస్ నేతలు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి చిత్ర పటాలకు పాలతో అభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు విష్ణుచారి, దయానంద్‌యాదవ్, సుదర్శన్, నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు కౌడె మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఘట్‌కేసర్: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేందర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 4న పట్టణంలోని బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి కళ్లు తిరిగి పడిపోయినట్లు సమాచారం అందుకున్న పెట్రోలింగ్ సిబ్బంది అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జోరుగా 'కాలనీ నేస్తం కాంగ్రెస్ హస్తం'



మల్కాజిగిరి: ఈస్ట్‌ఆనంద్‌బాగ్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'కాలనీ నేస్తం కాంగ్రెస్ హస్తం' కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఆదివారం ఎఎస్‌రావునగర్, క ల్యాణ్‌నగర్, సీఫెల్ కాలనీ, షిరిడీనగర్ తదితర ప్రాంతాల్లో డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలు తీరాలంటే రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ రాజ్యం రావాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, ఉమేష్‌సింగ్, బుచ్చిబాబు, వేణు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సామల యాదిరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు

పోచారం: పోచారంలోని మల్లిఖార్జున గుడిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. సామల యాదిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో రూ. 2.10 లక్షలతో అదనంగా రేకుల షెడ్, ఫ్లోరింగ్, పెయింటింగ్ తదితర పనులను పూర్తిచేశారు. ఈ సందర్భంగా 500 మందికి అన్నదానం చేశారు. ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సామల యాదిరెడ్డి, సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజన కార్యక్రమాలను నిర్వహించేందుకు తామెల్లప్పుడూ ముందుంటామన్నారు. పోచారంలోని ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ సహకార సంఘ వైస్ చైర్మన్ బద్ధం అనంతరెడ్డి, కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, నాయకులు సామల కొండల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బద్ధం జగన్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆకిటి సుధీర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గుండె స్వామి, విజయేందర్‌రెడ్డి, వడ్డెర సంఘ అధ్యక్షుడు శివరాత్రి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ ఎర్ర సత్యనారయణ బీఆర్ఎస్‌లో చేరారు. ఉపసర్పంచ్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంత్రి మల్లారెడ్డి నివాసంలో పార్టీలో చేరారు. మంత్రి మల్లారెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు భాగ్యారెడ్డి, శ్రీరాంరెడ్డి,అశోక్, శ్రీనివాస్, రమోదర్‌రెడ్డి, బాలయ్య, సుదర్శన్,రాజు, మాజీ ఎంపీటీసీ సత్యనారయణ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘనంగా బోనాల పండుగ



అమ్మవారిని దర్శించుకున్న మాధవరెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మారుతీనగర్‌లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సీఐ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, సంజీవముదిరాజ్, సత్యనారాయణ యాదవ్, శ్రీనుయాదవ్, లాయర్ సత్యనారాయణ యాదవ్, నరేశ్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి 1998-1999 బ్యాచ్ విద్యార్థుల సిల్వర్‌జూబ్లీ వేడుకలు ఆదివారం రాంపల్లిలోని రచ్చరామ్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గురువులను సత్కరించారు.



అప్‌డేట్ కావాల్సిందే..

- పదేళ్లు పూర్తయిన వారందరికీ ఆధార్ నవీనీకరణ తప్పని సరి
- అడ్రస్, పేరులో అక్షరాలు, ఫొటో, ఫోన్ నంబర్ మార్పునకు అవకాశం
- వచ్చేనెల 14 వరకు గడువు పొడిగింపు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆధార్ కార్డు నవీకరణ గడువును కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పొడిగించింది. కార్డులు పొంది పదేళ్ల పూర్తయిన వారు, ప్రస్తుతం ఉన్న కార్డులను నవీనీకరించుకోవాలని ఇప్పటికే యూఐడీఏఐ సూచించింది. ఆధార్ కార్డు నవీనీకరణకు మొదట జూన్ 14 వరకు గడువు విధించారు. అయితే ప్రజల నుంచి నామ మాత్రంగా స్పందన రావడంతో గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. 2010-18 సంవత్సరాల మధ్య ఆధార్ కార్డులు పొందినవారు సెప్టెంబరు 14 వరకు ఉచితంగా నవీనీకరించుకోవచ్చని ప్రభుత్వం సూచించింది.

రెండు రకాలుగా...

ఆధార్ కార్డును మై-ఆధార్ పోర్టల్, ఎం-ఆధార్ యాప్‌లో ఉచితంగా నవీనీకరించుకోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్న శాశ్వత ఆధార్ కేంద్రాల్లోనూ మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఆధార్ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు గతంలో ప్రజలు చెప్పిన వ్యక్తిగత వివరాలను మాత్రమే హడావుడిగా నమోదు చేశారు. చాలా మంది తప్పుడు సమాచారం ఇచ్చినట్లు గుర్తించారు. ప్రస్తుతం,.. గతంలో ప్రజలు వెల్లడించిన వివరాల ప్రకారం ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసి నవీనీకరించుకోవచ్చు. నవీనీకరణకు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రాన్ని ఖచ్చితంగా సమర్పించాల్సి ఉంటుంది. అక్షరాస్యులైతే పదో తరగతి మార్కుల మెమోను తీసుకెళ్తే సరిపోతుంది. ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, వివాహ పత్రం, తహసీల్దార్ జారీ చేసిన ధ్రువపత్రాలను తీసుకెళ్లి ఆధార్ కార్డు నవీనీకరణను పూర్తి చేసుకోవచ్చు.



ఇతర మార్పులకు ఇలా...

ప్రస్తుతం పదేళ్లు దాటిన వారందరూ ఆధార్ కార్డు సమాచారాన్ని నవీనీకరించుకోవాల్సి ఉంది. దీంతోపాటు పేరులో అక్షరాలను సరి చేసుకోవడానికి, ఫొటో, చిరునామా మార్పు, ఫోన్ నంబర్లలో మార్పులు చేసుకోవచ్చును. జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్రస్తుతం ఆధార్ నమోదు కేంద్రాలు అందుబాటులో లేవు. నవీనీకరణకు తప్పనిసరిగా మండల కేంద్రాలకు వెళ్లాల్సి ఉండటంతో చాలా మంది ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. గతంలో కొత్తగా ఆధార్ కార్డుల జారీ సమయంలో గ్రామాల వారీగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ నవీనీకరణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.